క్లుప్తంగా

స్వచ్ఛ గ్రామానికి కృషి చేయాలి



పెబ్బేరు రూరల్: గ్రామంలో స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ వినీలారాణి కోరారు. గురువారం ఆమె శ్రీరంగాపురం మండల కేంద్రంలోని స్వయం సహాయక సంఘాలు, మహిళలు, వీఓలతో కలిసి స్వచ్ఛత సమ్మేళన గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకొని, స్వచ్ఛ గ్రామంగా మారేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఇంటి వద్దనే తడి, పొడి చెత్త వేరు చేసి పంచాయతీ ట్రాక్టర్‌కి అందించి సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని మహిళలతో కలిసి శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఏపీఓ గట్టయ్య, కార్యదర్శి నందకిషోర్, నాగరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ బాధ్యత



ఆత్మకూర్: సామాజిక సేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మెర్సి వసంత, వైస్ ప్రిన్సిపాల్ రాధిక అన్నారు. గురువారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వచ్ఛ్ భారత్‌లో భాగంగా పారిశుద్ధ్య, సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని, ముళ్లపొదలు తొలగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు షకీల్‌అహ్మద్, శ్రీనివాసులు, గోపాల్, వెంకటేశ్వర్‌రెడ్డి, లత, గిరిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

పెబ్బేరు రూరల్: జిల్లా స్థాయి (ఎస్‌జీఎఫ్) పాఠశాల క్రీడా ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ కనబరిచిన పెబ్బేరు మాంటిస్సోరి పాఠశాల విద్యార్థి సింధు, ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన నందిని ని పాఠశాల యజమాన్యం గురువారం అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో రాణించే విధంగా చేయడమే తమ లక్ష్యమని ప్రిన్సిపాల్ రాజేందర్‌గౌడ్ తెలిపారు.

దివ్యాంగుల పింఛన్ పెంచాలి

పెబ్బేరు రూరల్: దివ్యాంగులకు పింఛన్ రూ.10వేలకు పెంచుతూ, ఉచిత విద్యుత్, ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఎన్‌డీఆర్‌డీ జిల్లా గౌరవ అధ్యక్షుడు బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌డీఆర్‌డీ) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అక్టోబర్ 9న చేపట్టిన చలో హైదారాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రభుస్వామి, శ్యాంసుందర్‌రెడ్డి, మీసాల మోహన్, కృష్ణయ్య, రాములు, కురుమయ్య, లక్ష్మ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని అన్ని పాఠశాలల్లో పీఆర్టీయూ టీఎస్ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు దాసరి చిన్నరాములు, ప్రధాన కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బౌద్ధారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో డెబ్బై శాతం మంది ఉపాధ్యాయులు పీఆర్టీయూ టీఎస్ సంఘంలో సభ్యులుగా ఉన్నారని, మిగతా ఉపాధ్యాయులు సంఘంలో చేరి సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలన్నారు. ఎనిమిదేళ్లుగా పదోన్నతులు లేక స్తంభించిన విద్యాశాఖలో నేడు పదోన్నతులు, బదిలీలు జరుగుతున్నాయంటే అది పీఆర్టీయూ టీఎస్ సంఘం చలువే అన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు సూర చంద్రశేఖర్, శివశంకర్‌యాదవ్, రామచంద్రయ్య, ఈశ్వర్‌రెడ్డి, వరప్రసాద్, రవి, ప్రదీప్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



పెబ్బేరు రూరల్: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని వనపర్తి పట్టణ కేంద్రంలోని యాదవ కమ్యూనిటీ హాల్‌లో బీసీ సమాజ్, అఖిలపక్ష ఐక్యవేదిక సంయుక్తంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సమాజ్ అధ్యక్షుడు సూర్యరావు, శ్రీనివాస్‌సాగర్, అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్‌యాదవ్, ప్రజా కవి గంధం నాగరాజు, అడ్వకేట్ రమేష్, అరుణ్, రమేష్, ఆంజనేయులు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ కరువు

- మరుగున పడుతున్న రామన్‌పాడు పర్యాటకం
- జలాశయం వద్ద కనీస వసతులు కరువు
- గుంతలమయంగా లింకు రోడ్డు



గుంతలమయంగా ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డు (ఫైల్)



రామన్‌పాడు ప్రాజెక్టు కట్టపై ముళ్ల పొదలు

మదనాపురం: వనపర్తి జిల్లాలో రామన్‌పాడు జలాశయం వద్ద ఎన్నెన్నో అందాలు ఉన్నప్పటికీ పట్టించుకునే వారు లేక మరుగున పడుతోంది. ప్రకృతి రమణీయ దృశ్యాలు, ఆహ్లాదకరమైన వాతావరణం, పక్షుల కిలకిల రావాలు, ఊకచెట్టు వాగు జలసవ్వడి వెరసి పర్యాటకులను పులకరించే అందాలు ఎన్నో ఉన్నాయి. ఊకచెట్టు వాగు పోటెత్తినప్పుడల్లా ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తారు. ఈ దృశ్యాలను తిలకించేందుకు ప్రజలు కొకొల్లలుగా తరలివస్తారు. ప్రాజెక్టు వద్దకు చేరుకోవడానికి సరైన రహదారులు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఏడాది పొడవునా పూర్తిస్థాయి నీటిమట్టంతో కళకళలాడే ప్రాజెక్టును పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఈ ప్రాంత ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పాలకులు ఆ దిశగా అడుగులు వేస్తే తమకు ఉపాధి సైతం దొరుకుతుందని వేడుకుంటున్నారు.

సాయం సంధ్య వేళలో..

ప్రాజెక్టు పక్కన ఉన్న నెమళ్ల గట్టుపై వివిధ రకాలైన పక్షులు నివాసం ఉంటున్నాయి. సాయంత్రం వేళ వాటి కేకలు వింటే ఎంతో మధురానుభూతి కలుగుతోంది. పక్షుల కిలకిల రాగాలతో ఆ ప్రాంతంలో సంగీత కచ్చేరి నడుస్తుందా అన్నంతగా పర్యాటకులను కట్టి పడేస్తాయి.

ప్రాజెక్టుపై వెలగని లైట్లు

ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆనకట్ట దారిపై 60 లైట్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో లైట్లు వెలిగించేందుకు, భద్రత కోసం సిబ్బందిని నియమించారు. కానీ ఈ మధ్యకాలంలో రాత్రి వేళలో లైట్లు వేయడం లేదని, జలాశయం చిమ్మ చీకట్లో దర్శనమిస్తోందని పరిసర గ్రామాల ప్రజల ఆరోపిస్తున్నారు. అజ్జకొల్లు, రామన్‌పాడు, గ్రామాల ప్రజలు ఆత్మకూరు వెళ్లాలంటే కారు చీకటిలో ప్రాజెక్టు మీద ప్రయాణం చేయాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రాజెక్టుపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కట్ట పొడవున ముళ్ల పొదలు అలుముకొని రోడ్డు కనిపించని విధంగా ఉంది.

రోడ్డు గుంతలమయం

రామన్‌పాడు ప్రాజెక్టుకు వెళ్లాలంటే రోడ్డు మార్గం నరకాన్ని తలపిస్తుంది. గత వర్షాకాలంలో ఊకచెట్టు వాగుకు వరద పోటెత్తడంతో ఆత్మకూర్, అమరచింత మండలాలకు కార్లు, ద్విచక్ర వాహనాలపై వెళ్లడానికి ఎంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుంతలమయమై బురద నిండి ఉండడంతో వాహనాలు దెబ్బతిన్నాయని వాపోతున్నారు. ఈ మధ్య ప్రాజెక్టు వరకు రోడ్ల మరమ్మతుకు రూ.10 లక్షలు వెచ్చించి పనులు చేపట్టినా ఫలితం లేకపోయింది. తూతూమంత్రంగా అక్కడక్కడ కంప చెట్లు తొలగించి వదిలేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకే తాగునీరు సాగునీరు అందించే జలాశయంపై అధికారులు చిన్నచూపు చూడడంపై విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

రాత్రిళ్లు చీకటిమయం



ఎంతో చరిత్ర కలిగిన రామన్‌పాడు ప్రాజెక్టుపై అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ప్రాజెక్టుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. రామన్‌పాడు నుంచి ఆత్మకూరు వరకు రోడ్డుపై గుంతల్లో మురుగు కనిపిస్తుంది. రాత్రి వేళల్లో ప్రాజెక్టుపైన లైట్లు వేయడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ప్రధాన కారణం.

– అంజద్ అలీ, రామన్‌పాడు

భయం గుప్పిట్లో..



రామన్‌పాడు ప్రాజెక్టుకు వెళ్లాలంటే రోడ్డు సరిగా లేకపోవడంతో ద్విచక్ర వాహనాలపై ప్రయణించాలంటే భయంగా ఉంటుంది. అధికారుల పర్యవేక్షణ మాత్రం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతుతో పాటు పర్యాటకంగా తీర్చిదిద్దాలి.

– నర్సింహులు, అమరచింత

మరమ్మతులు చేస్తాం

ప్రాజెక్టుకు సంబంధించి రామన్‌పాడు నుంచి ఆత్మకూర్ వరకు లింకు రోడ్డు మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేస్తాం. ప్రాజెక్టుపై 20 ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేసాం. రాత్రి వేళల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సిబ్బంది విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు.

– జగన్మోహన్‌రెడ్డి, ఈఈ, నీటి పారుదల శాఖ, పెబ్బేరు డివిజన్

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి



దళితుల ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: గృహలక్ష్మి పథకంలో అర్హత ఉన్న ప్రతి దళిత కుటుంబానికి మొదటి విడతలోనే ఇల్లు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వెంగళాయిపల్లిలో దళితుల ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా మంది దళిత కుటుంబాలు గుడిసెలు, రేకుల షెడ్లు, కొట్టాలు వంటి వాటిలో నివసిస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి 76ఏళ్లు కావస్తున్నా దళితులు దయనీయ స్థితుల్లో నివసించడానికి పాలకుల వైఫల్యమే కారణమని విమర్శించారు. ఇళ్ల కోసం ప్రభుత్వాలు ఎన్ని పథకాలు అమలు చేస్తున్నా దళితులకు ఇంకా అందని ద్రాక్షగానే మిగిలిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉపాధి కూలీ రూ.500కు పెంచాలి

గ్రామాల్లో పెరిగిన వ్యవసాయ కూలీ రేట్లకు అనుగుణంగా ఉపాధి హామీ కూలి రూ.500కు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. పనులు చేస్తున్నా రెగ్యూలర్‌గా కూలి అందడం లేదని, మరి కొంతమంది ఖాతాల్లో డబ్బులు ఉన్నా పోస్టాఫీసుల్లో సాంకేతిక లోపంతో తీసుకోలేని పరిస్థితి ఉందని పలువురు కూలీలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో చిన్న హన్మంతు, మల్లెపు నర్సింహ, బాలమశమ్మ, గోపాల్, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి



ఉపాధ్యాయులకు సభ్యత్వ రసీదులు అందజేస్తున్న జిల్లా కార్యదర్శి కృష్ణయ్య

వీపనగండ్ల: ఉపాధ్యాయుల్లో పదోన్నతులు, బదిలీల ప్రక్రియను కొనసాగించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు కల్వరాల, పుల్గర్‌చర్ల, తూముకుంట, బొల్లారం గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉపాధ్యాయ సంఘాలు పోరాడి సాధించుకున్న బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను కొందరు నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వం దృష్టి సారించి పూర్తి స్థాయిలో బదిలీల ప్రక్రియను కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పాఠశాల బిల్లులు, మౌలిక వసతులను వెంటనే సమకూర్చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు బాలీశ్వర్, తిరుమలేష్, కృష్ణ, శరత్, స్వామి, శివుడు, తస్యం తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధిహామీ’లో అక్రమాలకు చోటు లేదు



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీఓ నర్సింహులు

మదనాపురం: గ్రామీణ ప్రాంతాల్లోని పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తావు లేదని, సిబ్బందితో పాటు క్షేత్రస్థాయిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా పనిచేయాలని డీఆర్డీఓ నర్సింహులు సూచించారు. గురువారం మదనాపురం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జూన్ 1, 2022 నుంచి ఆగస్టు 31, 2023 వరకు రూ.5.84కోట్లు ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేశారు. వీటిపై సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించి, గ్రామాల వారీగా కూలీల వివరాలను పని వివరాలను సభలో వివరించారు. కొంతమంది విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో పద్ధతి మార్చుకోకుంటే విధుల నుంచి తొలగిస్తామని పరోక్షంగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ సుల్తాన్, ఏపీఓ రహీం, అంబుడ్స్‌పర్సన్ నారాయణరెడ్డి, ఎంపీడీఓ నాగేంద్రం, ఎస్ఆర్పీ కొండలు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆందోళనకు గురికావొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పాన్‌గల్: ప్రతి విద్యార్థి చదువుపై మాత్రమే దృష్టి సారించాలని, ఇతర విషయాలను ఆలోచించి మానసిక ఆందోళనకు గురికావద్దని పీహెచ్‌సీ డాక్టర్ చిరంజీవి అన్నారు. ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మాందాపూర్, బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞాపకశక్తి, ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు, పరీక్షల భయం, ఒంటరితనం వంటి మానసిక సమస్యలు ఉన్న వారు వాటిని కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్నేహితులతో పంచుకొని వాటి నుంచి బయట పడేందుకు ప్రయత్నించాలని సూచించారు. దీంతో పాటు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టెలిమానస్ క్రింద 14416 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. చిన్న సమస్యలకే ప్రాణాలు తీసుకునే తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ప్రతి నిత్యం యోగ, ధాన్యం చేస్తూ ఏకాగ్రతను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు శ్రీకాంత్, నిహారిక, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసులు, వైద్య సిబ్బంది బుడ్డమ్మ, కళావతి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

గోపాల్‌పేట: విద్యార్థులు ధైర్యంగా ఉండి మానసిక ఒత్తిడిని జయించి చదువులో రాణించాలని డాక్టర్ సబ్రిన్ అన్నారు. గురువారం ఆమె రేవల్లి కేజీబీవీ పాఠశాల, బండరావిపాకుల పాఠశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురైతే వెంటనే స్నేహితులకు చెప్పడంతో పాటు ఉపాధ్యాయులు, వైద్యులను సంప్రదించి చెప్పుకుని సరైన కౌన్సిలింగ్ తీసుకోవాలని చెప్పారు. అందుకు తోడుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టోల్ ఫ్రీ నంబర్ 14416కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఓలు జ్యోతి, దీప్తి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

వనపర్తి టౌన్: రోడ్ల విస్తరణలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాన్‌గల్ రోడ్డు, ఫారిద్ రైస్ మిల్, చౌడేశ్వరి టెంపుల్, స్మశాన వాటిక, పీర్ల గుట్ట, బండారునగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ తులసి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న స్తంభాలు తొలగించడం, కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడం, 11కేవీ లైన్, ఎల్‌టీ లైన్‌కు ఉన్న గృహ, వ్యాపార, పరిశ్రమల వైర్లను కొత్తగా లాగిన వైర్లకు కలపడం తదితర పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గృహ, వ్యాపార, పరిశ్రమల వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

గోపాల్‌పేట: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చడంతో ఇతర పార్టీలకు చెందిన వారు బీఆర్‌ఎస్ చేరుతున్నారని రేవల్లి ఎంపీపీ సేనాపతి, నాయకుడు శివరాంరెడ్డి అన్నారు. గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమక్షంలో రేవల్లి మండల కేంద్రానికి చెందిన సుమారు 60 మంది పార్టీలో చేరారని చెప్పారు. మంత్రి చేపట్టిన పనులను చూసే వారంతా పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన రేవల్లి వార్డు సభ్యురాలు బుచ్చమ్మ, మండల యువజన ప్రధాన కార్యదర్శి శివకృష్ణ, సోషల్ మీడియా కార్యదర్శి శివకాశి, బీజేపీకి చెందిన కొందరు నాయకులు పార్టీలో చేరినట్లు తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత

వీపనగండ్ల: మండలంలోని పుల్గర్‌చర్ల గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలకు గురువారం బీఆర్ఎస్ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిన చెక్కులను అందజేశారు. గ్రామానికి చెందిన గంగాధర్‌కు రూ.24 వేలు, ఎల్లమ్మకు రూ.20 వేల చెక్కును బీఆర్‌ఎస్ నాయకులు ఎద్దుల సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి సహకారంతో చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కోదండం, సుభాష్, పెద్ద బాలస్వామి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జి.ఉత్తరయ్య

వనపర్తి టౌన్: లోక్‌అదాలత్ ద్వారా పలు వర్గాల ప్రజలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని లోక్ అదాలత్ డిఫెన్స్ కౌన్సిల్ ఉత్తరయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని రావూస్ జూనియర్ కళాశాలలో లోక్‌అదాలత్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సైబర్ నేరాలు, గృహహింస, ఫోక్సో, ర్యాగింగ్, మోటార్ వెహికిల్ యాక్ట్ తదితర చట్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చట్టవిరుద్ధ పనులకు పాల్పడకూడదని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలను కాలక్షేపంగా ప్రారంభిస్తే తర్వాత అది వ్యసనంగా మారుతుందని వివరించారు. అనంతరం లోక్‌అదాలత్ ద్వారా అమలవుతున్న సేవల కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు డి. కృష్ణయ్య, కళాశాల ప్రిన్సిపాల్ రామకుమార్, న్యాయవాది రియాజ్, అహ్మద్, లోక్ అదాలత్ సిబ్బంది స్వప్న, నరేష్‌గౌడ్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



బహుమతి గెలుచున్న విద్యార్థులతో ఎంఈఓ

కొత్తకోట: గోపాల్‌పేట మండలంలోని బుద్దారంలో ఈనెల 20న నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్–17 విభాగంలో కొత్తకోట (బాలుర, బాలిక) బాలుర టీం ప్రథమ స్థానంలో నిలిచింది. ఫైనల్లో వనపర్తి, కొత్తకోట టీంలు తలపడగా హోరాహోరిగా జరిగిన పోటీలో వనపర్తి టీంపై కొత్తకోట టీం 20పాయింట్ల తేడాతో గెలుపొందినట్లు ఎంఈఓ కృష్ణయ్య తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించిన టీం సభ్యులను జెడ్పీహెచ్ కొత్తకోట హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ దయాకర్, మండల పీఆర్‌టీయూ గౌరవ అధక్షుడు, అప్పరాల జెడ్పీహెచ్ హెచ్‌ఎం గోపాల్, కొత్తకోట మండల ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జ్ రాంమోహన్‌చారి, రాజేందర్, శేఖర్, పీఈటీలు అభినందించారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలో జరిగే కబడ్డీ పోటీలకు ఎంపికైన చరణ్, రాజు, పాండును వారు అభినందించారు.

ఎక్సైజ్ అధికారుల తనిఖీలు



గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని కేశంపేట పాత తండా, తల్పునూరు తండాల్లో గురువారం వనపర్తి జిల్లా ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కేశంపేట పాతతండాలో బెల్ల పానకాన్ని పారబోశారు. నిర్మానుష్య ప్రాంతంలో బెల్లంపానకం పెట్టడంతో నిందితులను పట్టుకోలేకపోయామని గోపాల్‌పేట ఎక్సైజ్ ఎస్ఐ చంద్రకళ తెలిపారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమించి సారా తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలను మోసం చేయడానికే మహిళా బిల్లు



మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

మదనాపురం: బీజేపీ ప్రభుత్వం మహిళా బిల్లుతో మరోసారి దేశ ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మతోన్మాద బీజేపీ తెచ్చిన బిల్లు ఆమోదం పొందిన అమలు కావడం దశాబ్ద కాలం సమయం పడుతుందన్నారు. లౌకిక వాదాన్ని రాజ్యాంగంలో లేకుండా చట్ట సవరణ చేసిందని, ఇలాంటి చర్యల్ని ప్రజాస్వామ్యవాదులంతా వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజల్ని సమీకరించి ఉద్యమాలు నిర్మిస్తానని ఆయన హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు రెండు పర్యాయాలు అధికారం ఇస్తే చేసింది ఏమి లేదని మండి పడ్డారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ మండల కార్యదర్శి రాజు, పెబ్బేర్ మండల కార్యదర్శి మండ్ల రాజు, చిన్న ఖాజా, నాయకులు వెంకట్ రాములు, వెంకటేష్, చిన్నయ్య, విష్ణు, చిరంజీవి, మణి, వర్ధన్, మొగిలి, సత్తన్న, మాసన్న, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని వివిధ వీధుల్లో ప్రతిష్ఠించిన గణపతి మండపాల్లో డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జీఎంఆర్ రావడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు పి.ప్రశాంత్, బోయేజ్, కృష్ణారెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జీఎమ్మార్‌ను శాలువాలతో సత్కరించారు.

అమరచింత: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తొలగిస్తూ వారి విజయాలకు అడ్డుగా ఉన్న విఘ్నాలను తొలగించు గణేషా అంటూ వినాయక విగ్రహానికి గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని జగన్‌వాడలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో వినాయకుడికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్, రమేష్, నరాల నారాయణ పాల్గొన్నారు.



కొత్తకోటలోని గణేష్ మండపంలో జీఎమ్మార్

ప్రభుత్వ నిరంకుశ వైఖరి సరికాదు

కొత్తకోట రూరల్: ఎన్నో ఏళ్లుగా చాలిచాలనీ వేతనాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు ఖచ్చిత వేతనం కింద రూ.26 ఇవ్వాలంటూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నెల రోజులుగా చేస్తున్న సమ్మె కార్యక్రమంలో భాగంగా గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కొత్తకోట చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి మండల పరిషత్ కార్యాలయం వద్ద సమ్మెలో కూర్చున్నారు. సమ్మెకు మద్దతుగా బీజేపీ రాష్ట్ర నాయకురాలు బాలమణెమ్మ, కౌన్సిలర్ భరత్‌భూషణ్ మద్దతు తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శారద, సహాయ కార్యదర్శి వెంకటేశ్వరమ్మ, వనజ, నిర్మల, సావిత్ర, స్వప్న, శోభ, విజయలక్ష్మి, మాధవి, అరుణ, పుష్పవతి, మంజుల, విక్టోరియా, సత్యమ్మ, మమత తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

పాన్‌గల్: అంగన్‌వాడీ కార్యకర్తలను రెగ్యూలరైజ్ చేస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని డా.బీఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాము, యూనియన్ సంఘం నాయకురాలు అలివేలు, మాధవి, వరలక్ష్మి, అనురాధ, అమృత, కల్పన, తిరుపతమ్మ, బొజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.



చిన్నంబావిలో కాంగ్రెస్ నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

పెబ్బేరు రూరల్: అంగన్‌వాడీ టీచర్ల సమ్మెపై ప్రభుత్వం నిరంకుశ వైఖరి ప్రదర్శిస్తుందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ అన్నారు. వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం వనపర్తి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ సమీపంలో నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ల యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు జ్యోతి, కవిత, సుమతి, భాగ్యలక్ష్మి, విజయ, నందిమల్ల రాములు తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో



కొత్తకోటలో..

భిక్షాటన చేస్తూ..

వీపనగండ్ల: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక నిరసన కార్యక్రమాన్ని చేపట్టిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు గురువారం మండల కేంద్రంలో ఇంటింటికీ తిరుగుతూ భిక్షాటన చేస్తూ తమ నిరసనను తెలియజేశారు. వీరి నిరసన దీక్షకు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, బాలీశ్వరయ్య, కృష్ణ తమ సంఘీభావాన్ని తెలియజేసి ఆర్థికసాయం అందజేశారు.

చిన్నంబావి: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మెను నిర్వహించారు. సమ్మెకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గ నాయకులు కొత్త కళ్యాణ్‌రావు అంగన్‌వాడీల సమ్మెకు విరాళం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలతరెడ్డి, చిన్నంబావి సర్పంచ్ రంజిత్‌కుమార్, ఎంపీటీసీ పుష్పావతి, రామచంద్రారెడ్డి, కృష్ణప్రసాద్ యాదవ్, బీచుపల్లి యాదవ్, మహదేవ్‌గౌడ్, జ్యోతి గౌడ్, రామృష్ణ, వడ్డెమాన్ బిచ్చన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసనలు

ఆత్మకూర్: అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లాసహకార్యదర్శి శ్రీహరి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, రాణి, నిర్మల తదితరులు ఉన్నారు.